- www.aknu.edu.in
- nannayavani@aknu.edu.in
- nannayanewstv
- Adikavi Nannaya University
- 9701293231



చాళుక్య ద్వారము
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ADIKAVI NANNAYA UNIVERSITY

విశ్వవిద్యాలయ స్థాయి తొలి తెలుగు వార పత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా.తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 2 | సంచిక : 21 | 28-02-2022 | పుటలు : 4


## విద్యార్థుల ప్రతిభకు నిదర్శనం క్లబ్ కార్నివాల్



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు



వేస్ట్ టూ వెల్త్ మరియు ఫోటోగ్రఫీ ఎగ్జిబిషన్ ను సదర్శించిన వీసీ

**26.02.22 (మీడియాసెల్)** విద్యార్థులలో సృజనాత్మక ఆలోచనలకు, ప్రతిభకు నిదర్శనం క్లబ్ కార్నివాల్ అని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. యూనివర్సిటీలో కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో శనివారం క్లబ్ కార్నవాల్ 2వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇంజనీరింగ్ వర్క్ షాప్ భవనంలో ఏర్పాటు చేసిన వేస్ట్ టూ హెల్త్ మరియు ఫోటోగ్రఫీ ఎగ్జిబిషన్ ను వీసీ సందర్శించారు. యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్ లో ఏర్పాటు చేసిన క్లబ్ కార్నివాల్ సమావేశానికి ముఖ్య అతిథిగా వీసీ ఆచార్య జగన్నాథరావు హాజరై విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. విశ్వవిద్యాలయాలు విద్యార్థులకు విద్యను అందించడంతో పాటు విజ్ఞాన కేంద్రాలుగాను, ప్రతిభను వెలికితీసే వేధికలుగాను ఉండాలనే ఉన్నత ఆలోచనలతో క్లబ్ కార్నివాల్ ను ప్రారంభించామని చెప్పారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ లోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం బిట్ క్లబ్, ఎలక్ట్రికల్ అండ్ ఇన్స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్ విభాగం ఇన్స్ట్రుమెంటేషన్ జిని క్లబ్, ఎలక్ట్రికల్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం వెక్టార్ క్లబ్, సైన్స్ అండ్ హ్యూమానిటిస్ విభాగం రైజ్ క్లబ్, మెకానికల్ ఇంజనీరింగ్ యాంత్రిక్ క్లబ్, నిర్మల్ సివిల్ ఇంజనీరింగ్ విభాగం నిర్మాణ్ క్లబ్ వంటి ఆరు క్లబ్ ల సమ్మేళనంతో క్లబ్ కార్నివాల్ ఏర్పాటైందన్నారు. క్లబ్ కార్నివాల్ ప్రారంభించిన రెండేళ్ళ కాలంలో విద్యార్థులు అనేక సృజనాత్మక అంశాలను, కార్యక్రమాలను చేపట్టారని తెలిపారు. క్లబ్ కార్నివాల్ లోని వ్యాసరచన, వ్యాపార ఆలోచనలు, క్విజ్, వక్తృత్వం, వేస్ట్ టూ వెల్త్, ఫోటోగ్రఫీ, స్కీడ్ గేమ్ వంటి కార్యక్రమాలు విద్యార్థుల ప్రతిభకు నిదర్శనమని తెలియజేసారు. విద్యార్థులకు అసరమైన అన్ని వసతులను విశ్వవిద్యాలయంలో కల్పిస్తూ వారి ఉన్నతికి పాటుపడుతున్నామన్నారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కు ఎ.ఐ.సి.టి.ఇ గుర్తింపును తీసుకువచ్చామని, నూతన ఆవిష్కరణలతో విద్యనందిస్తున్నామన్నారు. విద్యార్థులకు అవసరమైన ఉన్నత ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించే మార్గదర్శులుగా అధ్యాపకులు ఉండాలని తెలిపారు. ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ డా.వి.పెర్సిస్ మాట్లాడుతూ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అభివృద్ధికి ఎంతో సహకరిస్తున్న వీసీ జగన్నాథరావుకు కృతజ్ఞతలు తెలిపారు. స్టూడెంట్ క్లబ్స్ ద్వారా అనేక విద్య, విజ్ఞాన, వినూత్న కార్యక్రమాలు జరుగుతున్నాయని చెప్పారు. విద్యార్థులచే నిర్వహించబడిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. తరువాత ఆయా పోటీలలో ప్రతిభను కనపరచిన విద్యార్థులకు బహుమతులను అందజేసారు. క్లబ్ కార్నివాల్ నిర్వహకులు వీసీని సన్మానించి జ్ఞాపికను అందజేసారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, ఓ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకి, ప్రిన్సిపాల్ డా.వి పెర్సిస్, ఆచార్య పి.సురేష్ వర్మ, డా.పి.వెంకటేశ్వరరావు, డా.కె.రమణేశ్వరి, ఎన్.ఎస్.ఎస్ కోఆర్డినేటర్ డా.బి.కెజియారాణి మరియు విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.






## మాతృభాషను ప్రేమిద్దాం,గౌరవాన్ని కాపాడుదాం

**21.02.22 (మీడియాసెల్)** మాతృభాషను ప్రేమిస్తూ, మాతృభాష గౌరవాన్ని మరింత పెంచాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఆధ్వర్యంలో సోమవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. యూనివర్సిటీ సెమినార్ హాల్ లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు తన సందేశాన్ని పంపించారు. 1952లో బంగ్లాదేశ్ లోని ఢాకా విశ్వవిద్యాలయ విద్యార్థులు, కొందరు సామాజిక కార్యకర్తలు తమ మాతృభాషయైన బంగ్లా ఉనికిని కాపాడుకోవాలని నిరసన ప్రదర్శన నిర్వహించారని, అప్పటి పాకిస్తాన్ ప్రభుత్వం పోలీసులతో నిరసనకారులపై కాల్పులు జరపడంతో నిరసన మారణహోమంగా మారి 16 మందిని బలికొందని తెలిపారు. 1999లో యునెస్కో తొలిసారిగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఈ ప్రధాన భాషా ఉద్యమ అమరవీరుల సంస్మరణార్థం ప్రకటించిందని, బంగ్లా మాట్లాడే వారి మాతృభాష ప్రేమ కారణంగా ఈ రోజును ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటున్నామని మాతృభాషా దినోత్సవ శుభాకాంక్షలను తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ మాట్లాడుతూ మాతృభాషను ప్రేమిస్తూ, గౌరవిస్తూ, మాతృభాషపై మమకారాన్ని పెంచుకోవాలని అన్నారు. ఎవరి మాతృభాషను వారు పరిరక్షించుకోవాలని తెలిపారు. తాను ఆంగ్ల ఆచార్యుడనే అయినా సభల్లో, సమావేశాల్లో, వ్యవహారంలోను ఎక్కువగా మాతృభాషయైన తెలుగు భాషలోనే మాట్లాడతానని చెప్పారు. తెలుగుభాషలో ఉన్న మాధుర్యం ఎంతో ఉన్నతమైనదని గ్రహించి తెలుగుభాషపై పట్టు సాధించాలని తెలిపారు. ఒ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకి మాట్లాడుతూ అభివృద్ధి చెందిన దేశాలు మాతృభాషకు అధిక ప్రాధాన్యతనిస్తాయని చెప్పారు.ఏ భాషలో లేని విధంగా తెలుగుభాషలో భావ వ్యక్తీకరణ, చమత్కారం ఉంటుందని తెలిపారు.ప్రధానవక్త మహర్షి సాత్యవతేయ విజ్ఞాన పరిషత్ అధ్యక్షులు ఆచార్య రంకిరెడ్డి రామమోహనరావు మాట్లాడుతూ సంస్కృత మహాభారతాన్ని తెలుగులో అనువదించిన భాషా సంస్కర్త ఆదికవి నన్నయ పేరుతో ఉన్న విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న వీసీ, రిజిస్ట్రార్ లను అభినందించారు. మనందరి మాతృభాషయైన తెలుగు భాషా చారిత్రక విషయాలను, సాహిత్య ఔన్నత్యాన్ని వివరించారు. తెలుగుభాషపై ఆదిలో సంస్కృతం, మధ్యలో ఉర్దూ, ప్రస్తుతం ఆంగ్ల భాషల ప్రభావం ఉందని చెప్పారు. మనమంతా తెలుగు భాషను భవిష్యత్ తరాలకు అందించే వారధులుగా ఉండాలని తెలిపారు. తల్లిపాలతోనే సంక్రమించిన మాతృభాషను గౌరవిస్తూ కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని చెప్పారు. ఇష్టంతో, సాధన చేస్తే సాధించలేనిదేదీ లేదని తెలియజేసారు. తెలుగుశాఖ విభాగాధిపతి డా.కె.వి.ఎన్.డి.వరప్రసాద్ మాట్లాడుతూ తెలుగుశాఖ అభివృద్ధికి, తెలుగుభాష, సాహిత్య ప్రగతికి అన్ని విధాల సహకారాన్ని అందిస్తున్న వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డా.తలారివాసు, డా.డి.లక్ష్మీ నరసమ్మ, పరిశోధక, తెలుగు విద్యార్థులు,వివిధ విభాగాల విద్యార్థులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ ఆచార్య అశోక్

## సంపాదకీయం



# సైన్స్ - ప్రకృతి

సైన్సు ఒక మహారణ్యమైతే, ప్రయోగశాల ముని కుటీరం, రసాయనాలు,గాజు నాళికలు చెట్లు చేమలు. పంచభూతాల కలయిక వల్లనే చరాచర సృష్టి జరిగిందని అంటారు.ఈ గాలి, ఈ నేల, నీరు, నిప్పు, ఆకాశం ఒక క్రమంలో కలిసి మనిషి శరీరంలోని ప్రత్యణువునూ నిర్మించాయని అంటారు. పూర్వం మనిషి నిద్రలేస్తూనే భూమికి నమస్కరించేవాడు.సూర్యుని ప్రార్థించేవాడు. చెట్టు చుట్టూ ప్రదక్షిణ చేసేవాడు. నీటిని, నిప్పును పవిత్రంగా భావించేవాడు. ప్రస్తుతం మనిషి విజయాలన్నీ ప్రకృతితో అనుసంధానం చేయడంలో కాకుండా ప్రకృతిని జయించటం మీద ఆధారపడి ఉన్నాయి.

ఆధునిక మానవుడు సాంకేతికంగా పురోగమిస్తూ ఉండొచ్చు. కానీ ప్రకృతికి కలిగిస్తున్న నష్టంతో తనకు తానే ప్రమాదాన్ని కొనితెచ్చుకుంటున్నాడు.మనిషి కూడా ప్రాథమికంగా ఒక జంతువనే విషయాన్ని మర్చిపోకూడదు. ఎందుకంటే అతడు హ్యూమన్ యానిమల్! సోషల్ యానిమల్ అంటాం.సంఘ పశువే కదా! మనిషి లోపలి పశుత్వానికి ప్రకృతి నుండి సహజంగా పొందాల్సిన కొన్ని అవసరాలుంటాయి. మొక్కలు పువ్వులతో సంబంధం, చెట్లతో అనుబంధం,సహచర ప్రాణులతో సంభాషణ,ఎండ పొడను అనుభవించటం,నీళ్లు, వెన్నెల, నిర్మలమైన గాలి... ఇవన్నీ అవసరమే.

కాళిదాసు 'అభిజ్ఞాన శాకుంతలం'లో శకుంతల ఇద్దరు ముని కుమారులతో కణ్వాశ్రమం నుంచి దుష్యంతుని రాజ్యం చేరుకుంటుంది. అందులో ఒక మునికుమారుడు ఆ నగరాన్ని చూసి విస్తుపోయి 'జనసందోహంతో నిండిపోయి గందరగోళంగా ఉన్న ఈ నగరం తగలబడుతున్న ఇల్లులా అనిపిస్తుంది.ఈ రద్దీగా ఉన్న నగరంలో నేను ఉండలేకపోతున్నానంటాడు.మరొక మునికుమారుడు 'నాకు కూడా ఈ నగరం నచ్చలేదు.ఇక్కడి జనం ప్రాపంచిక విషయాల్లో మునిగితేలుతూ విషయలాలసత్వమనే అపరిశుభ్రతను కలిగి ఉన్నారు. నేను కూడా భరించలేక పోతున్నాను' అంటాడు. ఇది ఎన్నో శతాబ్దాల కిందటి మాట.ఇప్పుడు నగరం కాదు ప్రపంచమే కాలుష్యంతో తగలబడిపోతుంది.

సైన్స్ అభివృద్ధి చెంది పారిశ్రామికీకరణ వల్ల ప్రకృతితో మనిషి సామరస్యం దెబ్బతింది. కొండలు కరిగిపోతున్నాయి.నదులు,సముద్రాలు రసాయనాల మయమయ్యాయి.

మనకు అక్కరలేనిదేదీ తీసుకోవద్దని,తీసుకొన్నదేదీ వృధా చేయవద్దని పాతకాలపు మనుషులు పాటించిన ప్రకృతి సూత్రాన్ని గుర్తు చేసుకోవాల్సిన అవసరం ప్రస్తుతం ఏర్పడింది. సైన్స్ అభివృద్ధితో పాటు సత్య కాలపు మనుషుల మాటల్ని వంటబట్టించుకొని మనిషి తనను తాను రక్షించుకోవటానికి ఆలోచిస్తాడని ఆశిద్దాం!!

- డా.తలారి వాసు

# వృక్షరాజ శతకం

పుస్తకం

ఎదిగిన కొద్దీ ఒదిగి ఉండమంటుంది చెట్టు. నేలమీద ఇంత కన్నా శ్రేష్ఠమైనది మరొకటి లేదు.చెట్టు పెరిగితే మానవాళికి కల్పతరువు కాగలదు.తరువు ఈ నేలకి గొప్ప ప్రసాదం. ఈ కవి అడబాల - చెట్టు అడవిబాల!

శాస్త్ర విషయాల్ని చిన్న చిన్న మాటల్లో పద్యాల్లో కూర్చటం నిజంగా కళే! రైజోబియా,నత్రితాలు, చాలనీ నాళాలు,పత్ర రంధ్రాలు... ఇలా ఎన్నో వృక్షశాస్త్ర అంశాలు ఈ శతకంలో ఆటవెలది పద్యాలై నర్తించాయి." నిన్ను మించు వైద్యుడెన్నగా లేడులే" అని సహజ ఔషధ ప్రదమైన చెట్టుని స్తుతిస్తున్నారు ఈ కవి.చెట్లకు గల ఔషధీగుణం గొప్పగా వ్యక్తీకరించారు చాలా పద్యాల్లో. చెట్లు ఆరు రుచులలో ఐదింటిని అందిస్తాయి. అలవోకగా సముద్రం ఆరవదైన ఉప్పును మనకు అందిస్తుంది. షడ్రుచుల సమ్మేళనం ఉగాది పచ్చడి... అని మన పండుగల్లోని పరమార్థాన్ని కూడా మధ్య మధ్యలో వివరించారు. అనాదిగా మన జీవన చిత్రాన్ని సుందరంగా చిత్రించడంలో చెట్టుపాత్ర గురించి వివరించారు.

బోధి వృక్షమే గౌతముణ్ణి సిద్ధార్థునిగా చేసింది. చెట్టు జగన్నాథుడై పూరీ పుణ్యక్షేత్రంలో పూజలందుకుంటుంది. రామబాణ పరీక్షకు ఉదాహరణగా నిలిచినది తాటి చెట్టు." వృక్షో రక్షతి రక్షితః" అంటూ మన వారు వేదాల్లో ధర్మానికిచ్చినంత ప్రాధాన్యాన్ని చెట్టుకిచ్చారు. అందుకే 'చెట్టే నాకు ఆదర్శం' అన్నారొక ప్రసిద్ధ కవి.ఈ వృక్షరాజ శతకంలో మరొక సాహితీ గంగా ప్రసాదం తెలుగువారికి లభించినట్లే!"తరువు మనకు గురువు" అనే విషయాన్ని మర్చిపోకూడదు. ఈ సైన్స్ డే నాటికి చెట్టుపై పద్య రచన





అందించిన సైన్సు మాస్టారు,రచయిత గంగా ప్రసాద్ మరిన్ని కృతులను రచించాలని నా ఆకాంక్ష!!

- పొన్నపల్లి శ్రీరామారావు

## 28th February National Science Day



Commemorated in the honor of Sir C.V. Raman for his legacy, who discovered Raman Effect on 28th February 1928



జ్ఞానలక్ష్మీ జాగ్రత్పరిణామమిమ్ము
దయతో శ్రీకాళహస్తీశ్వరా!
-- ధూర్జటి మహాకవి
మహా శివరాత్రి పర్వదిన శుభాకాంక్షలు!!

- నన్నయవాణి

# అభినందన



నన్నయవాణిని పరిశీలిస్తున్న మంత్రివర్యులు శ్రీ కురసాల కన్నబాబు.

నన్నయవాణి విశ్వవిద్యాలయ సమాచారంతో పాటు, విజ్ఞాన దాయకమైన అంశాలను కూడా ప్రచురించడం ఎంతో బాగుంది. విశ్వవిద్యాలయ చరిత్రను అక్షరబద్ధం చేయడానికి పత్రిక వాహికగా నిలుస్తుంది. ఈ ఆర్టికల్స్ చూస్తున్నప్పుడు మంచి విలువలతో పత్రిక నడుస్తుందని అర్థమవుతోంది. విద్యార్థులకు, సమాజానికి ఈ పత్రికను అందించడంతో సమాచారం చేరుతుంది. ఈ పత్రికను నాకు కూడా పంపించండి. చక్కని పత్రికను స్థాపించి నడిపిస్తున్న వీసీ జగన్నాథరావు గారికి నా అభినందనలు తెలియజేస్తున్నాను.

## మంచి మాట



జంతువులు, జలచరాలు, ఉభయచరాలు ఇవన్నీ వివిధ ప్రవర్తనలతో, ఆహారపుటలవాట్లతో ఉంటాయి.ఇన్ని జీవులమధ్య ఉండే జీవి మానవుడు.మానవుడొక్కడే కాదు జీవి అంటే.జీవరాశిని తొలగిస్తూ,అంతరింపజేయటం రక్తమాంసాల్ని అమ్ముకొని జీవించటమే!




ప్రతిభా వాణి

# విజ్ఞాన శాస్త్ర దినోత్సవం

## సివి రామన్ సహజ శాస్త్రవేత్త



ప్రకృతిని నిశితంగా పరిశీలించి గొప్ప రహస్యాలను ఛేదించిన సహజ శాస్త్రవేత్త సర్ సి.వి. రామన్.కేవలం 200 రూపాయల పరికరాలతో ప్రయోగాలు చేసి నోబెల్ బహుమతి (1927)పొందిన ఘనత ఆయనది. పదార్థం లోపల ఫోటాను శక్తి పాక్షికంగా మార్పు చెందుతుందని గుర్తించి నిరూపించిన తొలివ్యక్తి సి.వి. రామన్.


యూరప్ నుండి కోల్కతాకు 1921లో వస్తున్న ఒక నౌక మీద ఒంటరిగా కూర్చుని ఉన్న రామన్ ఎటుచూసినా సముద్రం నీలి రంగులో కనిపించడంలో అతని మనసులో ఒక ప్రశ్న ఉదయించింది. సముద్రానికి నీలంరంగు ఎలా వచ్చింది అని. ఆకాశమే సముద్రంలో ప్రతిబింబిస్తుందని అప్పటివరకూ విశ్వసిస్తున్న సత్యం. దీనికి ప్రాతిపదిక లార్డ్ రేలీ ప్రతిపాదన. భూ వాతావరణంలోని వాయువుల సూక్ష్మ అణువులు సూర్యకాంతిని చెదరగొడతాయి. అలా విక్షేపం చెందిన కాంతిలో తక్కువ పొడవు కాంతి తరంగాలు ఎక్కువగా ఉంటాయి. వాటి రంగు నీలం. కాబట్టి మనకు నీలంగా కనబడుతుంది.ఆ నీలి వర్ణమే సముద్ర జలాలో ప్రతిఫలించి సముద్రంలో కనపడుతోందని ఆయన భావించారు.

తన వద్ద ఎల్లప్పుడూ ఉండే నికోల్ పట్టకం (ప్రిజం) తో అప్పటికప్పుడు ప్రాథమిక పరిశీలన చేసి సముద్రపు నీలవర్ణం ఆకాశాన్ని ప్రతిబింబింప చేయడం వల్ల వచ్చింది కాదని పరిశోధనలు ప్రారంభించాడు రామన్. కాంతికి ఉండే క్వాంటం ధర్మం దారితీస్తుందన్న కోణం నుండి పరిశోధన సాగింది. x కిరణాలు పదార్థాల గుండా ప్రసరించినప్పుడు వాటి స్వభావం మారుతుందని రాంట్జన్ కనిపెట్టాడు. ఇందుకు గాను ఆయనకు నోబెల్ బహుమతి వచ్చింది. x కిరణాల ప్రసారంలో రాంట్జన్ ఎఫెక్ట్ నిజమైనప్పుడు కాంతి కిరణాల లోనూ అదే వర్తించి తీరాలి అని తాను కనిపెట్టిన కొత్త రేడియేషన్ను ప్రకటించారు. ప్రపంచమంతా దానిని "రామన్ ఎఫెక్ట్" అని ప్రశంసలతో ముంచెత్తింది.

రసాయనిక సమ్మేళనాల సూక్ష్మ స్వరూపాన్ని అర్థం చేసుకోవడానికి రామన్ ఎఫెక్ట్ కీలకంగా మారింది. కేవలం పది సంవత్సరాలలో రామన్ ఎఫెక్ట్ ఉపయోగించి రెండువేల రసాయనిక సమ్మేళనాలు అంతర్గత నిర్మాణాలను నిర్ధారించారు. సముద్రానికి నీలం రంగు ఎలా వచ్చిందనేది ఒక ప్రశ్న కాదు.గులాబీలు అన్ని రంగుల్లో ఎందుకు పూస్తాయో, వజ్రాలు అన్ని రంగుల్లో ఎందుకు ప్రకాశిస్తాయో, రాళు ళ అన్ని రంగుల్లో ఎందుకు ఉంటాయో చెప్పగలిగారు. అతి శక్తివంతమైన రేడియేషన్‌తో ఉండే కిరణాలు కని పెట్టిన తర్వాత రామన్ ఎఫెక్ట్ మరోసారి ప్రాచుర్యంలోకి వచ్చింది. ఫిబ్రవరి 28 రామన్ ఎఫెక్ట్ ని దృష్టిలో పెట్టుకొని సైన్స్ డే గా (విజ్ఞానశాస్త్ర దినోత్సవం) మనం జరుపుకునే సందర్భంగా మారింది.

(డిస్కవరీ - సైన్స్ మైలురాళ్లు నుండి)

## ఎందరో విజ్ఞాన శాస్త్ర మహానుభావులు!!




అతని కన్నులు రాబర్ట్ బ్రౌన్ లా కంటికి కనిపించని కణాన్ని కూడా కనుగొనగలవు...
అతని చూపులు సర్ సి. వి. రామన్ ప్రభావంలా మారి కాంతి కిరణాలను సైతం శోధించగలవు...
అతని చేతులు రాకేష్ శర్మలా అవని అంచులు సైతం అందుకోగలవు...
అతని అడుగులు డార్విన్ లా మారి జీవ పరిణామం నుండి ప్రస్తుత మానవాళి వరకు ప్రయాణించగలవు
అతని హృదయం విలియం హార్వే లా మారి హృదయ స్పందనను వినిపించగలదు...
అతని మెదడు స్టీఫెన్ హ్యాకింగ్ లా అంతరిక్షం లో పాలపుంతలు వాటి అవధులను సైతం అంచనా వేయగలదు...
అతని ప్రాణం జగదీష్ చంద్రబోస్ లా మారి మనకు ప్రాణ వాయువును అందించే మొక్కలకు కూడా జీవం ఉందని నిరూపించగలదు...
అతను నీతో నాతో మన అందరితో సంచరించే అలుపెరుగని శ్రామికులే మన శాస్త్రవేత్తలు!!
ఎందరో మహానుభావులు అందరికి వందనాలు!!

- టి.తరుణ్ సాయితేజ, ఎమ్మెస్సీ (బోటనీ)

## ఉపకులపతి ఉవాచ

### రాతియుగం నుంచి రోదసి వరకు..



రాయిని ఆయుధంగా, పనిముట్టుగా ఉపయోగించిన నాటి నుండి,నిప్పును వినియోగించటం తెలిసిన దగ్గరనుండి, చక్రాన్ని ప్రయోగించి ప్రయాణించినది మొదలుగా మనిషి నిరంతర శ్రమ, ప్రకృతి మీద ఆధిపత్యం సంపాదించడానికి పడిన తపన, తాను సుఖపడాలనే ఆలోచన విజ్ఞాన శాస్త్రాభివృద్ధికి దారితీసింది.

రాతి నుంచి రాకెట్ వరకు,అగ్ని నుంచి అణుశక్తి వరకు, చక్రం నుంచి పాలపుంత అన్వేషణ వరకు సైన్స్ లో ఎన్ని మలుపులో! మనిషి మేధాశక్తి, కఠోర పరిశ్రమతో నాటి నుండి నేటి వరకు ఎన్ని ఆవిష్కరణలో!! ప్రపంచమొక పద్మవ్యూహం... విజ్ఞాన అన్వేషణ ఒక తీరని దాహం! ప్రతిరోజూ ప్రపంచంలో ఏదో ఒక ఆవిష్కరణ జరుగుతూనే ఉంది. సత్యశోధనలా శాస్త్రజ్ఞుల మేధ అపురూపమైంది. చరకుని విజ్ఞాన వ్యాప్తి, ఆర్యభట్టు అసాధారణ ప్రజ్ఞ, సుశ్రుతుని శస్త్రచికిత్సా నైపుణ్యం...ప్రాచ్య, పాశ్చాత్య శాస్త్రవేత్తల కృషి... వీరందరి శ్రమ ఫలితమే ఇవాళ ప్రపంచాన్ని మన అరచేతిలో చూడగలుగుతున్నాం. అటువంటి విజ్ఞాన శాస్త్రవేత్తలందరికీ అక్షర నీరాజనాన్ని సమర్పిస్తూ విజ్ఞానశాస్త్ర దినోత్సవ(సైన్స్ డే) శుభాకాంక్షలు అందిస్తున్నాను.

మొక్కా జగన్నాథరావు

# గూడెం క్యాంపస్‌లో ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం





ఆదికవి నన్నయ యూనివర్సిటీ తాడేపల్లిగూడెం ప్రాంగణంలో ఎన్.ఎస్.ఎస్. యూనిట్ ప్రారంభ సెషన్ ను ప్రిన్సిపాల్ ఆచార్య కొట్టి శ్రీరమేష్ ఎన్.ఎస్.ఎస్ కోఆర్డినేటర్ డా.బి.కెజియారాణి ప్రారంభించారు. ఎన్.ఎస్.ఎస్ యూనిట్ హెల్తీ మేనేజ్‌మెంట్ క్లబ్ ఆఫ్ యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్‌తో కలిసి బ్లడ్ గ్రూపింగ్, బ్లడ్ ప్రెజర్ చెక్ చేయడం మరియు పేషెంట్ కౌన్సెలింగ్‌తో సహా బాడీ మాస్ ఇండెక్స్ రిపోర్టింగ్ కార్యక్రమాన్ని నిర్వహించింది. ముఖ్య అతిథి ప్రొఫెసర్ కె.శ్రీరమేష్, విశిష్ట అతిథి డా.కెజియారాణి జాతీయ సేవా పథకం కార్యక్రమాల విశిష్టతను తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ పి.వో జె.కృష్ణంరాజు, హెల్త్ మేనేజ్‌మెంట్ క్లబ్ ఫ్యాకల్టీ అడ్వైజర్ డా.సురేంద్రబాబు, డా. హీరా బట్టు, స్టూడెంట్ చైర్మన్ నరేంద్ర, లోకేష్ పాల్గొన్నారు.

# ఆర్యభట్ట మ్యూజియాన్ని సందర్శించిన బి.ఎడ్. విద్యార్థులు

ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ లోని బి.ఎడ్ విద్యార్థులు ఆర్యభట్ట సైన్స్ అండ్ టెక్నాలజీ మ్యూజియాన్ని సందర్శించారు. సైన్స్ డే సందర్భంగా ఆర్యభట్ట సైన్స్ అండ్ టెక్నాలజీ మ్యూజియంను సదంర్శించి పలు విషయాలను విద్యార్థులు తెలుసుకున్నారు. ఆర్యభట్ట సైన్స్ అండ్ టెక్నాలజీ మ్యూజియంలోని అనేక అవశేషాలు, 3డి మ్యాప్స్, చార్ట్స్, సోలార్ సిస్టం వంటి అన్ని విషయాలు బిఈడీలోని ప్రాజెక్టులకు ఎంతగానో ఉపయోగపడతాయని విద్యార్థులు ఆనందాన్ని వ్యక్తం చేసారు. ఆర్యభట్ట సైన్స్ అండ్ టెక్నాలజీ మ్యూజియం నిర్వహకులకు యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ అధ్యాపకులు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డా.ఎం.గోపాలకృష్ణ, డా.ఎలీషాబాబు, డా.సాంబశివరావు, డా.వరహాలదొర, డా.రాజమణి పాల్గొన్నారు.



ఆర్యభట్ట మ్యూజియాన్ని సందర్శించిన బి.ఎడ్ విద్యార్థులు

# ఆహ్లాదకరంగా డా.వై.ఎస్.ఆర్ ఉద్యాన సందర్శన 2022





డా.వై.ఎస్.ఆర్. ఉద్యాన విశ్వవిద్యాలయం నిర్వహించిన ఉద్యాన సందర్శన2022కు విశేష స్పందన వచ్చింది. ఉభయగోదావరి జిల్లాల్లోని విద్యార్థులను, రైతులను ఉద్యాన సందర్శన ఆకట్టుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మార్గదర్శకాలు అనుసరించి ఉభయ గోదావరి జిల్లాలలో ఉన్న నాలుగు విశ్వవిద్యాలయాల సమాఖ్య (క్లస్టర్) కార్యాచరణ క్రింద ఆయా విశ్వవిద్యాలయాలు సంయుక్తంగా కార్యక్రమాలు నిర్వహించాలని జరిగిన ఒప్పందంలో భాగంగా గురువారం వెంకటరామన్నగూడెం డా. వై.ఎస్.ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం ప్రాంగణంలో "ఉద్యాన సందర్శన" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ క్లస్టర్ పరిధిలోని నాలుగు విశ్వవిద్యాలయాల విద్యార్థులు, రైతులు హాజరయ్యారు. డా.వై.ఎస్.ఆర్.ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి టి.జానకిరామ్,ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఓ.ఎస్.డి. ఆచార్య ఎస్.టేకితో కలసి " ఉద్యాన సందర్సన" కార్యక్రమం ప్రారంభించారు. వివిధ పాఠశాలలు, కళాశాలలుకు చెందిన వందలాది మంది విద్యార్థులు తమ అధ్యాపకులతో వచ్చి, ఉద్యాన సందర్శనలో ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్ , ప్రదర్శన క్షేత్రాలు సందర్శించారు. ఉద్యాన శాస్త్రం, ఉద్యాన పంటలపై శాస్త్రవేత్తలు, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య టి.జానకిరామ్ మాట్లాడుతూ "క్లస్టర్ గా ఏర్పడిన నాలుగు విశ్వవిద్యాలయాలు చేసే పరిశోధనలు, రూపొందించిన సాంకేతిక పరిజ్ఞానం ఇచ్చి పుచ్చుకుంటూ విద్యార్థులకు, ఆచార్యలకు, శాస్త్రవేత్తలకు విస్తృతమైన అవగాహన, అవకాశాలు కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు సహకారంతో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఉద్యాన సందర్శన, పోషకాహార అవగాహన సదస్సులు, స్టూడెంట్ ఎక్స్ చేంజ్ ప్రోగ్రామ్స్ మరియు పరస్పర సహకార కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రతి మొదటి శనివారం మరియు మూడవ శనివారం (పని దినాలులో మాత్రమే) వివిధ పాఠశాలలు, కళాశాలలు కు చెందిన విద్యార్థులు డా.వై.యస్.ఆర్. ఉద్యాన విశ్వవిద్యాలయం ను సందర్శించి ఇక్కడ జరుగుతున్న వివిధ పరిశోధనలు, శిక్షణ కార్యక్రమాలు గురించి తెలుసుకోవచ్చునన్నారు. తరువాత ఉద్యానయాత్రను నిర్వహించి, ఉద్యాన సందర్శన స్టాల్స్ ను పరిశీలించారు. ఈ కార్యక్రమములో డా.వై.ఎస్.ఆర్.ఉద్యాన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డా.కె. గోపాల్, డా.బి.శ్రీనివాసులు విస్తరణ సంచాలకులు, డా.ఆర్.వి.ఎస్.కె.రెడ్డి పరిశోధన సంచాలకులు, డీన్ ఆఫ్ హార్టికల్చర్ మరియు పరీక్షల నియంత్రణాధికారి డా.ఎ.ఎస్.పద్మావతమ్మ యూనివర్సిటీ లైబ్రేరియన్ మరియు ఎస్సీ ఎస్టీ సెల్ ఆఫీసర్ ఇన్ చార్జ డా.డి.వెంకట స్వామి, డీన్ ఆఫ్ పిజి స్టడీస్ డా.కె.ఉమాజ్యోతి, డైరెక్టర్ ఆఫ్ ఇండస్ట్రీయల్ అండ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం డా.కె.ధనంజయరావు, ఎస్టేట్ ఆఫీసర్ మల్లికార్జునరావు, ఉద్యాన కళాశాల అసోసియేట్స్ డా.మాధవి, కృషి విజ్ఞాన కేంద్రం (కె.వి.కె) ప్రధాన శాస్త్రవేత్తలు డా.ఇ కరుణ శ్రీ, డా. లలితా కామేశ్వరి, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అధికారులు డా.కె.రమణేశ్వరి, డా ఎం.కమలకుమారి, డా.కెజియారాణి, డా.బి.జగన్మోహనరెడ్డి, ఆచార్య.వై.శ్రీనివాసరావు, డా.ఎస్.ఉదయ భాస్కర్, జాతీయ ఆయిల్ పామ్ పరిశోధన స్థానం అధికారులు, శ్రీ వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ, ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, ప్రభుత్వ ఉద్యాన శాఖ, వ్యవసాయ శాఖ అధికారులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.




# ఫ్రెషర్స్‌డే వినోదాలు

**డిపార్ట్మెంట్ ఆఫ్ ఎడ్యుకేషన్ - బి.ఎడ్.అనూర్.**











ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in